# గాంధీబొమ్మ

ఈ పొద్దు గాంధీ పుట్టినదినం!

నాకుతెల్సి యిట్లామాదిరి పుట్టినదినాలు ఎన్నొచ్చినాయో? ఎన్నెన్ని పాయ్‌నాయో? నేనేమన్నా పట్టించుకుణ్ణాణా పాడా? వాటిపాటి కవ్వి వచ్చినాయి. వచ్చినట్టే పాయ్‌నాయి. నాపాటికి నేను నాదోవన పోతానే ఉండా.

అయినా నా పుట్టినదినం నాకు తెల్సి ఏడిస్తేగదా ఈ పుట్టినదినాలు సింగినాదాలు పట్టించుకుండేదానికి? అప్పిటికీ అప్పుడెప్పుడో ఒకసారి మాయమ్మను అడిగితే...

''నలగాంపల్లిలో తొలీతగా బార్తం జరిగిందే? అప్పుడు గదంట్రా నువ్వు పుట్టింది. అయినా ఈ కలిగినోళ్ల కల్లేపుడులు మనకెందుకు లేరా?'' అనె.

నిజిమేగదా? కొవ్వెక్కినోళ్లు కొవ్వొత్తులు ఆర్పుకుంటా ఉంటే తిరగబోతలోకి అంత తిరిపిం సమురుకు నోచుకోలేకుండా తిప్పలు పడేవాళ్లు పడ్తానే ఉండారు.

అయితే ఈపొద్దు ఒక దినం మాత్రం ఉన్నోడు లేనోడు యిద్దరూ వొగిటై పోతా ఉండారు. మహన్నబావుడి పుట్టిన పండగ చేసుకుంటా ఉండారు. ఎండలు కాసే ఈ బూమండలమంతా పండగచేసుకుంటా ఉండారంటే అదేమంత అల్పసొల్పమైన కతగాదే? ఈ చేత్తో చేస్తే ఆ చేత్తో మర్సిపాయ్ నీయబ్బ నాకేం గావాలనే ఈ జనం ఆయన్ను మాత్రం మర్సిపోలా? ఎందుకు? –

ఆ పొద్దు ఆ పెద్దాయన మాట మంత్రమయింది. హుం! మాట మంత్రమయ్యేదంటే మాట్లా? దానికెంత నిష్టుండాల? ఎంత నీమం ఉండాల. ఎంత గురి ఉండాల. ఎంత గుష్టి

ఉండాల. ఇవన్నీ ఉణ్ణాయి కాబట్టే ఆయన మహాత్ముడైనాడు. ఆ మహాత్ముడి మాట మంత్రమయింది. ఆ మంత్రంలో మనసెగితి యంత్రమో తంత్రమో అయింది. తెల్లోణ్ణి తరిమి తరిమి కొట్టింది. మనకు సొతంత్రం వచ్చేసింది!

ఇదంతా ఆయన చేతి చలవేనని మనమంతా మర్చిపోకుండా ఈ పొద్దు పండగ చేసుకుంటా ఉండాం. ఎట్ట చేసుకుంటా ఉండాం? అంటే- ఏడ్చే దాని మొగుడొస్తే నా మొగుడూ వస్తాడన్నెట్టు. అయినా అది ఏరే కత! -

ఏది ఎట్టయినా గాంది పుట్టిన దినం ఈ జాతికి యింకా గుర్తుండాది. దానికి సంతోషించాల!

''సంతోషించినాములే! ఇంతకూ నీ ఏడుపేంది?'' అంటే-

మాయబ్బతో చెప్తా ఉండా. నేనెప్పుడూ గాంది పుట్టిన దినాన్ని పట్టించుకోలా. అది ఎందుకో గానీ ఈ పొద్దు జల్మాని కొక శివరాత్రి అన్నెట్టుగా పట్టించుకోవాలని బుద్ధి పుట్టె. అయితే ఈ పొద్దు నేనేం చెయ్యాల? అదే నన్ను పట్టుకుణ్ణె సంగటం!

అయితే ఈ పొద్దంతా ఏం చెయ్యాలంటే? ప్రకాశం పంతులు మాదిర్తో తెల్లోడి తుపాకి గుండుకు గుండేమన్నా చూపించాల్నా? పన్లే. తిలక్ మాదిర 'సొతంత్రం నా జన్మ హక్కు' ని అరవాల్నా? ఇప్పుడెందుకు? పోనీ! అల్లూరి సీతారామ రాజు మాదిర అడవుల మిందపడి పోరకలాడాల్నా? పనేలే. పోలీసోళ్ల చేతుల్లో లాటీకట్టె దెబ్బలు తినాల్నా? జైలుకు పోవాల్నా? ఏం పన్లే. అయితే యింకేం చెయ్యాల? -

ఈ పొద్దు పొద్దు గూట్లో పడేదాకా అపద్దం చెప్ప కూడదు. అదేమన్నా గానీ ఆడి తప్పకూడదు. పరాయి ఆడదాన్ని కన్నెత్తి చూడ కూడదు. ఒకరిని హింస పెట్టకూడదు. అని తీర్మానం చేసుకుణ్ణా!

కట్టె కడతేరి పాయ్‌నా జీవుడు మటుకు మన చుట్టు పక్కల్నే కొటకలాడ్తా ఉంటిందని మనోళ్లు నమ్ముతారు. ఈ చుట్టు పక్కల్లో గాంది జీవుడే తిరగలాడ్తా ఉంటే నిద్దర లేస్తానే నేనిట్టా నిర్ధారించుకుణ్ణిందానికి ఆ జీవుడికి ఎంత కుశాలవితిందో? ఇట్టా అనుకుండే కుందికి జీవుడి కతేమోకానీ నాకు మటుకు శానా కుశాలేసె. ఆ కుశాలతో తెంపుగా పైకి లేసినా!

ఆ మద్దె ఎప్పుడో ఇజయవాడకు పొయ్యుంటి. ఇంటి పేరు పురాణం అయినా ఆయన పారాయణం చేస్తా ఉండేది నేటి బారతం లో రామాయిణమే కదా? అటుమంటి గొప్పోళ్లను కలుసుకుండేది గూడా ఒక బాగ్గెమే గదా? అని ఆయన ఇంటికి పొయ్యుంటి.

ఆయన ఈ మాట ఆ మాట మాట్లాడ్తా ఉండి ఆడొక గాంది బొమ్మ ఉంటే దాన్నెత్తి నా చేతికిచ్చె! ఇచ్చింది ఒక పెద్దాయన. ఇచ్చిందా ఒక పెద్దాయన్ను. ఇద్దరి మిందుండే బగితితో తీసుకుంటి. బద్రంగా తెచ్చి ఇంట్లో పెట్టుకుంటి. ఇప్పుడు చక్కా పొయ్ ఆ బొమ్మ ముందర నిలబడుకుణ్ణా!

పిచ్చోడు తాత! బోసినవ్వులు నవ్వతా ఉండాడు.

*బోడితలలో పిలక*
*బోసినవ్వుల మొలక*
*కలిసి ఏమో పలుక*
*కదిలాయి లోకాలు!*

– అని శంకరం బాడి సుందరాచారి పాడతా ఉణ్ణె పాట మణుసులో మెదిలే కుందికి రొండు చేతులెత్తి దణ్ణంపెట్నా. దయిర్నంగా ఎలబార్నా.

''యాడకి లేసి సక్కా పోతా ఉండావే? ఈ పొద్దు గాందీ జయంతి గదా? కడగోటు బిడ్డె కాలేజీకి పోవాలంటనే? ఆడేందో ఉరాగింపు ఉండాదంటనే!''

''ఊరేగమను. నేనేమన్నా వద్దన్నానా?''

''నువ్వెందుకు వద్దంటావులే? దుడ్డు దుగ్గాణి కర్సుండే పనైతే పరవాలే. అదిసరే గానీ నిన్ననంగా చెప్తిని గదా? ఆ బిడ్డకు మన జండా వొగిటి కావాలని. ఇద్దో తెస్తానంటా పోతివి. ఆమాట ఎట్ట పాయెనో. కప్ప తినేసి పాయ. ఈ పొద్దు లేసి సక్కా పోతా ఉండావు.''

ఆ మాటే మర్సి పొయ్‌నా. ఇప్పుడేం చెయ్యాల్రా నా సామీ అనుకుండే కుందికి నా గుండెల్లో రాయి పడె. కొంచేపు నీళ్ల నమిల్నా. నీళ్ల నమల్తా అట్నే నిలబడుకుంటే నెత్తిన ఏం పడ్తుందో అనుకోని–

''నిన్న పొద్దు గూకులూ అదే పని గదా? ఆ గాందీరోడ్లో చిన్న బజార్లో నేను ఎక్కి దిగని అంగిడే లేదనుకో. ఎవుర్ని అడిగినా సీజను కాదే? అనే మాటే. గాందీరోడ్లో ఉండుకోని గూడా గాంది జయంతి ఎప్పుడో తెలవకుండా పోతే ఇంకేడ పొయ్ ఏడవాల?''

''ఆహాహా! అదెవితో గాచ్చారం చాలకుండా గెరడ సేవకు పోతే ఇంట్లో మొగుణ్ణి గండు చీమ ఎత్తుకోని పొయ్యిందంట. అట్టుండాది గదే నువ్వు బొంకేది. ఈ పొద్దన్నా ఆ మహాత్ముణ్ణి తల్సుకోని నిజం చెప్పరాదా? ఆ నాలుగ్గాళ్లమండపం కాడ కుప్పలు పోసి అమ్మతా ఉంటే నిన్ననే కొనుక్కోనొచ్చి పెట్టుకున్నాన్లే!''

మా బాశాలి పక పక నవ్వతా ఉంటే నేను గాందీబొమ్మ కల్లా చూసినా. తాత ముసి ముసిగా నవ్వతా ఉండాడు. వంచిన తలెత్తకుండా బయిటపణ్ణా.

అపద్దం చెప్పకూడదు అనుకుంటానే చెప్పేస్తిని గదా? అని మణుసు యాదన పడ్తా ఉండాది. లోకం యాణ్నో పెట్టుకోని నడస్తా ఉండా. ఆడెవుడో ఒక పిలగాడు. శానా ఉతాళంగా సైకిల్ తొక్కుకోని వస్తా ఉండాడు. వాడికి ఉణ్ణెట్టుండి ఒక రిక్సా అడ్డమొచ్చె. వాడు అట్ట తిప్పి ఇట్ట తిప్పి కడాన నా మిందికి తిప్పె. నేనీ లోకంలో ఉంటే గదా– తప్పించు కుండే దానికి? తగలాల్సినన్ని దెబ్బలు తగల్నే తగిలె. ఆ దెబ్బతో అరికాలి మంట ఉచ్చికెక్కె. ఇంక చూస్కో నా సామి రంగా! ఆ పిలగాణ్ణి పట్టుకోని ఈ చెంపా ఆ చెంపా అదరగొడ్తి!

ఒక చెంప మీద కొడితే ఇంకొక చెంప చూపించ మనె గాందీ. అయితే నేనేం చేసినా? నా మాదిర అగుముడి యదవ ఎతికినా దొరకతాడా? నిద్దర లేస్తానే అనుకుణ్ణింది ఏంది? ఇప్పుడు అవతా ఉండేది ఏంది? అనే ఆలోచన కడుపులో పడే కుందికి కాలు ముందుకు కదల్లా!

అప్పుడు ఆడికొక కారొచ్చి నిలబడె. ఆ కారు నాలుగు బార్ల పొడుగుండాది. బలే నాజూగ్గా ఉండాది. ఆ కార్లో కూసోనుండే వాడు ఒక చిన్న గున్న ఏనిగ మాదిర్తో ఉండాడు. వాడు ఏసుకోనుండే సిల్కు జుబ్బా రేపటెండకు తళ తళ మెర్సిపోతా ఉండాది. నోట్లో ఉండే సిగరెట్టుకూడా తియ్యకుండానే కొండమిందికి పొయ్యే దోవ? అనడిగె!

వాడు అడగతా వుంటే వాడి నోట్లో వుండే సిగరట్టు 'చెప్తావా? లేదా?' అని పొగలు కక్కతా నామిందికి ఎగిరి పణ్ణెట్టుండాది. అది గెమనించే కుందికి నిజిం చెప్పొద్దూ! – నాకు వొళ్లట్నే రగిలె.

''ముందు నువ్వు కారు దిగు. ఏం కావాల్నో మల్లా అడుగు!'' అంటి.

వాడు నన్నొక మాదిరి చూసె. అట్టా చూస్తానే నోట్లో సిగరెట్టు చేతికి తీసుకుండె. చిటికనేలి కొనతో అట్టా తడతా ఉంటే బూడిద రాలి గాలికి పోతా ఉండాది. చూపుల్తోనే వాడు నన్నట్టా యిదిలించి కొటేసి వాడి దోవన వాడు పొయ.

వాడట్టా పొయ. నా మణుసు మహాత్ముడి మిందికి పొయ!

''ఈ దేశింలో నోటికొచ్చినట్టు మాట్లాడే దానికి... కాట్లాడే దానికి సెగితి ఉంటే చెయ్ చేసుకునే దానికి ఇంకా చెప్తే అట్టట్నే తలకాయిలు గూడా లేపేసే దానికి మహన్నబావుడు దోవ చూపించి పుణ్ణెం కట్టుకుండె. ఆయన పుట్టిన దినంలో కూడా నేనొకడికి దోవ చూపించ లేకుండా పోతినే!'' అని యాదన మిగిలె. అయితే ఏమి లాబం? అందుకే నా యదవ బుద్దిని తిట్టుకుంటా ఎగబడి పోతావుండా.

ఒక చిన్నది. లేత తమలపాకు మాదిర్తో నవ నవలాడ్తా ఉండాది. రంగు! పచ్చి పసుపు కొమ్ము. నీలాలా? అవ్వి నల్ల నేరేళ్లు. ఆ పిల్లది వాటి పాటికి వాట్ని యిడ్సి పెట్టేసి ఉండాది. అవ్వి ఈపంతా పాయలు పాయలుగా యాపించి యాలాడ్తా ఉండాయి. ఆ కురుల కల్లా చూస్తా ఉంటే ఎప్పుడో యాణ్ణో యిన్నానొక పాట. ''కొప్పు యిప్పి కురుల నీపై కప్పెతానురా!'' అని. ఆ పాట మణుసులో మెదిలె. ఈ చిన్నది యా చిన్నోణ్ణి ఈ కురుల్తో కప్పేదానికి పోతా వుండాదో? అదురుష్టమంటే వాడిదే! – ఆ అదురుస్టం నాది కాకూడదా? ఆ చిన్నోణ్ణి నేనే అవగూడదా?'' అని ఆశకు పోతావుంటే! 'రగుపతి రాగవ రాజారాం!' అంటా పాట చెవల్లో పడె. ఉలిక్కిపడ్తి. ఆ చిన్నదాని మింద చిగులుకుణ్ణె చూపుల్ని బలింతంగా మల్లిచ్చుకుంటి.

ఎదురుంగా రామ్మూర్తి!

''ఆలోచన తమ ఆదీనంలో వుంటే మాత్రం మణిసి సోదీనంలో లేకపోతే ఎట్టబ్బా?

బతికి బాలాలని లేదా? పోనీ? ఈ పొద్దు నాబాద ఎవుర్తో చెప్పుకోవాలని యాదనపడ్తా ఉంటే నువ్వే దొరికినావు. అదురుష్టమంటే నీదే. పదం పోదాం!''

''నీ బాద నాకు అదురుష్టమా? బాగుండాదేకత? ఇంతకూ ఏందిరా నీబాద?''

''ఒరె ఒరే! నీతో వచ్చిన బాదే యిది. తల్సుకుంటే తాళలేవు. పద. నిమ్మతిగా ఆడేడన్నా కూసోని చెప్తా. యిందువుగానీ...''

''ఈ పొద్దు గాందీ జయంతి యాడికీ పొయ్యేదిలే. గాందీ సాచ్చిగా యాడా కూసుండేదిలే.''

''అయ్యో! అదే నా బాద సామీ! వచ్చొచ్చి గాందీ జయంతి ఆదివారమే రావాల్నా? అనామత్తుగా పాయ గదా ఒక దినం లీవు. ఒక దినమంటే ఏం మాట్లా? ఆ బాద తీర్సు కోవాలనే గదా నేను ఎలబారింది.''

''నాతో చెప్తే తీరిపోతిందా?''

''అరే పిచ్చోడా! మణిసి మణిసికి ఒక మణుసు ఉంటిందని... ఆ మణుసును ఏదో ఒక బాద పట్టుకోని బాదిస్తానే ఉంటిందని మన దొరలకు తెల్సురా. అందుకే సందు సందుకొక సారాయంగిడి. అడుక్కొక్క బ్రాందీ అంగిడి పెట్టించినారు. ఆడికి పొయ్ కూసుంటే అది ఎటుమంటి బాదైనా సరే పటా పంచల్''

''రామ! రామ! ఒరే రామ్మూర్తీ! నీకు వొగిటేంది? పెట్టమంటే ఎయ్యిదండాలు ఎంచెంచి పెట్టా. ఈ పొద్దు నన్నిట్లా యిడ్సి పెట్రా.''

''తాగననే వాణ్ణి తాగమని బలింతం చేసేవాడు సుద్ధ యదవరా. నిన్నా మొన్నా నాలుగు చినుకులు రాలేకుందికి మున్సిపాల్టీ కొళాయిల్లో దూకతా ఉండాయే నీళ్ల ఆ మాదిర్తో మొందు గూడా దూకతా వుంటే పట్టి పట్టి పాలాడ్తో తాపించే దానికి ఈడెవుకీ ఓపికలే. నోరు మూసుకోని ఎంటరా. రొంచేపు కూసోని ఆ మాట ఈ మాటా మాట్లాడుకుందాం. మల్లా ఏముండాది? ఎవుడి దోవ వాడిది.''

వాడొక అగుటీటం పట్టిన మణిసి. తలకేస్తే కాలికి. కాలికేస్తే తలకేసే బాపత్తు. రొంచేపు కూసుంటే ఏమయి పోతిందిలే? అనుకుంటా వాడెంట పడ్తి. పొయ్ పొయ్ వాడొక బ్రాందీ అంగిట్లో దూరె!

మమ్మల చూస్తానే వాడు రొండు గళాసులెత్తి పెట్టె!

''ఒగిటి చాలు. వొగిటి చాల్లే!'' అని నేను అరస్తానే ఉండా-

''అది ఆడుంటే నీకేమి? అదేమన్నా నిన్ను పట్టి పెరక పోతిందా? కరవ పోతిందా? దెబ్బలు తిన్నె కుక్క మాదిర్తో అరస్తా ఉండావే?''

నేను నోరు మూసుకుంటి!

ఆ రొండు గళాసుల్లో దీంట్లో అంత దాంట్లో అంత పోసె.

''రొండు గళాసుల్లో పోసినావెందుకురా?'' అంటే-

''రొండుగాదు. నాలుగిట్లో పోసుకుంటా. నా యిష్టం. నువ్వెవురు అడిగే దానికి? ఒగిటి అయిపోతానే యింగొగిటి తీసుకుంటా. నీకెందుకు? నువ్వు నోర్మూసుకోనుండు.''

నేను గమ్మున చూస్తానే ఉండా. వాడా గళాసుల్లో సోడా గొట్టి పోసె. రొండు మంచు పెళ్లలెత్తి దాంట్లో ఏసె. ఒక గళాసెత్తి నోటికాడ పెట్టుకోని 'తాగమంటావా? కింది పోసేయమంటావా?' అనె.

''పోరాని చోటికి పోతే రారాని మాట్లు వస్తాయంట. రారాని చోటికొచ్చి చెయ్‌రాని పని చెయ్యాల్సి వచ్చెనే?'' అని గుణస్తా ఉంటే-

''ఒరే ఒరే! కొంప లంటక పోవుగానీ... కానీబ్బా!''

మా తల్లి సొచ్చిగా చెప్తా వుండా మల్లా? ఏమయిందో నాకు తెల్దు. నాకు ఒక మాదిరిగా సోదినానికి వచ్చేటప్పటికి నేను నాలుగ్గాళ్లమండపం కాడ నిలబడుకోనుండా!.

నేను ఏడో తరగతో ఎనిమిదో తరగతో చదువుకుంటా ఉణ్ణెప్పుడు మనకు సొతంత్రం వచ్చె. సొతంత్రం వస్తానే నాలుగ్గాళ్లమండపానికి ఎదురుంగా ఒక గాందీబొమ్మను పెట్రి. అంతకు మునుపు పెద్ద బజారుగా ఉణ్ణె పేరుమార్సి గాందీరోడ్ అని పేరు పెట్రి. నేను దినమ్మూ యిస్కూలికి పోతా పోతా ఆ బొమ్మకొక దణ్ణం కూడా పెట్టా ఉంటి.

సమ్మత్సరం తిరక్కుండానే ఆ మహన్నబావుణ్ణి లేపేసిరి!

అప్పుడు నాలుగ్గాళ్లమండపం కాడ ఒక పెద్ద పందిలేసిరి. సందేళ అయ్యేకుందికి ఊళ్లో వాళ్లంతా ఆడ చేర్తా ఉండ్రి. గాందీబొమ్మ కాడ కూసోని ఆయన ఆత్మ కతను చదివి యినిపిస్తా వుంటే అందురు ఆ మహన్నబావుడు పడిన కష్టాలు తల్సుకోని తల్సుకోని యాడస్తా ఉంటే వాళ్లతో కల్సుకోని నేను గూడా ఏడిస్తి. ఈ పొద్దూ యాడస్తా ఉండా!

''ఉణ్ణెట్టుండి బుజం మింద చెయ్‌పడ్తే ఉలిక్కి పడ్తి. ముత్తా రెడ్డన్న!''

''ఒరే అబ్బోడా! ఆ కండ్లల్లో నీళ్లెందుకురా? నువ్వొక పిచ్చోడివిరా. ఎందుకంటావా? గాందీ కల్లు మానండోయ్ బాబు! కండ్లు తెరవండోయ్! అంటే ఈ పొద్దు కల్లంగుల్లు సారాయంగుళ్లు పెట్టే సర్కారోడు బతకతా ఉండాడు. ఆ పద్దం చెప్పద్దంటే?- అసెంబ్లీలో కాదు అది పార్లమెంట్లోకాదు అపద్దం చెప్పకుండాపోతే అడుగు కదిలేటిగాలే. ఇంక ఆడదంటావా? అడ్డం పెట్టకుండాపోతే ఏపనీ అయ్యేటిగాలే. ఇట్టా మాదిరి ఆయన ఏంది వద్దన్నాడో దాన్నే అడ్డం పెట్టుకోని ఈ జనం బతికి పోతా వుండారు. నువ్వేందిరా? ఉప్పా? ఊరిగాయా? వాడా గాడ్సే గాందీని ఆవేశంతో లేపేస్తే మనోళ్లు ఈడ గాందీబొమ్మను ఆలోచనతో లేపేసినారు. గాందీరోడ్లో బ్రాందీ అని ఎగతాళి చేసినా చేస్తారని!- నువ్వు పోరాపో!'' అనె.

అవును గదా? యిదేమన్నా రష్యానా? లెనిన్ శవాన్ని కాపాడుకుణ్ణెట్టు గాందీబొమ్మనైనా కాపాడుకుండే దానికి? అనుకుంటి. ●